నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

వర్కింగ్ జర్నలిస్ట్‌ల హెల్త్ స్కీం పొడిగింపు: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూర్ అర్బన్: ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ 12న జీవో విడుదల చేసినట్లు కలెక్టర్, డిఎంఏసి ఛైర్మన్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్ని సార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (EHS) తరహాలో వైద్య సేవలు పొందవచ్చున్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

ఎగుడు దిగుడు రోడ్డు ఆదమరిస్తే షెడ్డు

అక్కడి గ్రామాలకెళ్లాలంటే.. సప్త సంద్రాలు.. లోతైన లోయలను దాటి వెళ్లాల్సిందేనన్న భావన ఉత్పన్నమవుతోంది. పట్టణాలకు పల్లెలే పట్టుకొమ్మలన్న నానుడి కాస్త నేడు ఆ దుర్భర పరిస్థితిలకు దారితీసింది. గ్రామాలకెళ్లాలంటే అక్కడి రోడ్లు మాత్రం వాహనదారులను కలవరపెడుతున్నాయి. రహదారులన్నీ గుంతలమయమై, కోతకు గురై దర్శనమిస్తున్నాయి. ఆదమరిస్తే బండి గుల్ల.. ఒళ్లు హూనం.. అనే చందంగా తయారైయ్యాయి. పూతలపట్టు నియోజకవర్గంలోని రహదారుల్లో కనీస అవసరాలకు పట్టణాలకు వెళ్లాలన్నా.. పట్టణ వాసులు గ్రామాలకు రావాలన్నా.. గంటల తరబడి కాలం పడుతోంది. నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు, పల్లె రోడ్లుల్లో గుంతలే.. గుంతలు.. పాలకులు పట్టించుకొనేరా.. రోడ్డు బాగుపడేనా.. అని గ్రామీణులు ఎదురుచూస్తున్నారు. - ప్రజాశక్తి-పూతలపట్టు

- అస్తవ్యస్తంగా గ్రామీణ రహదారులు
- వర్షాలకు మరింత అధ్వానం
- చెరువులు తలపిస్తున్న రోడ్లు
- మరమ్మతులు చేపట్టాలని గ్రామీణుల వేడుకోలు

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం రహదారుల వసతులు లేకుండా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బావులను తలపించేలా రహదారులపై ఏర్పడిన గుంతలు వాహన చోదకులను, పాదచారులను ఆసుపత్రి పాలు చేస్తోంది. మరి కొందరైతే ఏకంగా ప్రాణాలని వదులుకోవలసిన దుస్థితి నెలకొంది. ప్రస్తుతం గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రహదారులు మరింత అధ్వాన స్థితికి చేరుకున్నాయి. తారు రోడ్లు కాస్త మట్టి రోడ్లుగా అవతామెత్తయి. బావుల ను తలపించేలా ఉన్న గుంతల్లో చెరువులను తలపించేలా నీరు చేరడంతో రహదారి పరిస్థితిని గమనించలేని పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల ప్రజలు అయితే రోడ్ల దుస్థితితో చీకటి పడక ముందే గ్రామాలకు చేరుకోవలసిన దుస్థితి.

నియోజకవర్గంలో పరిస్థితి..

పూతలపట్టు నియోజకవర్గంలో తవణంపల్లి, యాదమరి, ఐరాల, బంగారు పాళ్యం, పూతలపట్టు ఐదు మండలాలు ఉన్నాయి. ఐదు మండలాల్లో 152 పంచాయ తీలు ఉండగా 1070 గ్రామాలు ఉన్నాయి. మండల కేంద్రానికి సుమారు పది నుంచి 15కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామాలు కూడా కనిపిస్తాయి. ఈ సుదూర గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి రావడానికి ప్రజలకు తలప్రాణం తోకకొస్తుంది. కొన్ని గ్రామాలకు అయితే ఏకంగా ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఒక్కసారి అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అదనంగా ఆటో బాడుగలు చెల్లిస్తే తప్ప మండల కేంద్రాలకు చేరుకోలేని దుస్థితి నెలకొంది.

నూతన ప్రభుత్వంలో తీరుమారేనా..?

గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. సమస్యలను పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకపోయింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రస్తుత ప్రభుత్వమైన గ్రామీణ రహదారులపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ వాసులు కోరుతున్నారు.

డిసివోకు దళిత సంఘాల సన్మానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం విద్యాలయల నూతన డీసీవోగా పద్మజా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ రంగపల్లి మునస్వామి, చైర్మన్ కొమ్మిట్ట దనంజయ రావు, జాయింట్ సెక్రటరీ పార్థ సారథి, అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక చిత్తూరు నగర అధ్యక్షులు కుమార్, దళిత నాయకులు కుమార్ స్వామి, డీసీవోని దుశ్శాలువలతో సత్కరించి పూల బొక్కే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరంగపల్లి మునస్వామి మాట్లాడుతూ గురుకుల విద్యాలయాలలో అనేక చోట్ల ప్రిన్సిపాల్‌గా పనిచేసి విద్యార్థుల అభ్యున్నత్తికి కళాశాలల అభివృద్ధికి విశేశంగా కృషి చేసిన పద్మజా చిత్తూర్ జిల్లాకు డీసీవోగా రావడం హర్షించ తగ్గ విషయం అన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో తరగతి గదులను ఆధునికరించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో చక్కటి బోధన అందిస్తున్న ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రజాశక్తి: జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఎంతమంది విద్యార్థులు ఉన్నారు..?

డీఈవో: ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు బడుల నుంచి ప్రభుత్వ బడుల్లో ఎక్కువ శాతం విద్యార్థులు చేరడం జరిగింది. జిల్లాలోని 4,804 ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3,36,422 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

ప్రజాశక్తి: ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఉందా..?

డిఈవో: దీర్ఘకాలికంగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. నూతన ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అవుతాయని ఆశిస్తున్నాం.

ప్రజాశక్తి: గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాలు ఎలా ఉన్నాయి..?

డీఈవో: గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణత 91.28 శాతం సాధించడం జరిగింది. బాలురు 88.91, బాలికలు 93.8 శాతం ఉత్తీర్ణులయ్యారు.

ప్రజాశక్తి: ప్లస్ టు జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరుతున్నారా.....?

డీఈవో: రాష్ట్ర ప్రభుత్వ ఆశయశాల మేరకు జిల్లాలో 20 ఉన్నత పాఠశాలలు జూనియర్ కళాశాలలగా ప్లస్ టు వరకు మార్చడం జరిగింది. ఈ పాఠశాలల్లో ఎంపీసీ బైపీసీ సీఈసీ కోర్సులను ప్రవేశపెట్టాము ప్రస్తుతానికి 63 మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చదువుతున్నారు.

మృతదేహంతో రోడ్డుపై బైఠాయింపు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఆవు ప్రమాదంలో మహిళ గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలో పలు అనుమానాలతో పోలీసులు మృతదాహన్ని ఖననం చేసేందుకు అడ్డుకున్నారు. దీంతో బంధువులు ఆదివారం ఎస్ఆర్ పురం చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై బైఠాటాయించి నిరసన తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. దేవి(57) మృతురాలు కొద్దిరోజుల క్రితం తన పాడి ఆవు సంరక్షణలో భాగంగా ఆమెకు గాయాలు పాలయ్యారు. దీంతో ఆమెను ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవ కోసం మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. దీంతో స్థానిక ఎస్ఐ రాజకుల్లాయప్ప మృతురాలు దేవకి ఇంటికి వెళ్లి, జరిగిన ప్రమాదంలో ఏవో అనుమానస్పదంగా ఉందని, తద్వారా మృతురాలిని ఖననం చేయడం కుదరదని, ఆపై పోస్టుమార్టం చేయాల్సి ఉందని బంధువులకు తెలిపారు. దీంతో బంధువులు, గ్రామస్తులు దేవికి పాడి ఆవు ప్రమాదంలో మృతి చెందిందని, అందులో ఎటువంటి అనుమానం లేదని తెలిపారు. ఆపై ఎస్ఐ అందుకు కుదరదని తెలపడంతో బంధువులు గ్రామస్తులు మృతురాలి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పోలీసు శాఖ ఉన్నతాధికారులకు ఎస్ఐ తెలిపారు. ఈ హైడ్రామా దాదాపు రెండు గంటల పాటు సాగింది. అనంతరం ఎస్ఐ సూచనల మేరకు పోలీసు శాఖ అనుమతి లభించడంతో మృతదేహాన్ని ఖననం చేయుటకు అంగీకారం తెలిపారు. దీంతో మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన వారు నిరసనను విరమించారు. అనంతరం మృతురాలి మృతదేహాన్ని బంధువులు, గ్రామస్తుల కలిసి ఖననం చేశారు.

వినాయకుని సేవలో డీజీపీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్, ఐరాల: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం ఏపీ డీజీపీ సీహెచ్ ద్వారక తిరుమల రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఎస్పి మణికంఠ చందోలు, ఆలయ దేవస్థానం అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటంకాలు, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా విఘ్నాలు తొలగిపోవాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు.

వాల్మీకులు వెనుకబడ్డారు..

- వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రజాశక్తి పుంగనూరు: వాల్మీకి బోయ వర్గానికి చెందినవారు అన్ని రంగాల వెనుకబడ్డారు అని రాష్ట్ర వాల్మీకి సంఘ అధ్యక్షుడు, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు దృష్టికి ఆదివారం తీసుకెళ్లారు. కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి వచ్చిన సందర్భంగా కలసి వినతి అందజేశారు. అలాగేసుకుమార్ బాబు డిజిపిని దృశ్యాలవుతో సన్మానించారు. రాష్ట్రంలోనూ, చిత్తూరు జిల్లాలో ఉన్న వాల్మీకి బోయ కులస్తుల జీవన ప్రక్రియ, వారి ఆర్థిక పరిస్థితులు, విద్యపరంగా ఎదిగినటువంటి స్థితిగతులను వారికి వివరించారు. డీజీపీని కలిసిన వారిలో అ సంఘం రాష్ట్ర నాయకురాలు సులోచన తెలుగుదేశం నాయకులు రవికుమార్ లు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న చీఫ్ సెక్రటరీ

ప్రజాశక్తి- తిరుమల: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ దంపతులు ఆదివారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్‌ను జేఈవో వీరబ్రహ్మం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఈఓ గౌతమి, డెప్యూటీ ఈవోలు లోకనాథం, హరీంధ్ర నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు

రేణిగుంట: రెండు రోజుల తిరుమల తిరుపతి పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం తిరుగు పయనమైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ జేఈఓ గౌతమి, జెసి ధ్యానచంద్ర, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ తదితరులు రేణిగుంట విమానాశ్రయం నందు సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిఎస్ దంపతులకు శ్రీవేంకటేశ్వర స్వామి వారి ప్రతిమను అందచేశారు.

వర్షానికి కూలిన చెట్టు

మూడు వాహనాలు ధ్వంసం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల బాటగంగమ్మ ఆలయం వద్ద పార్కింగ్ ప్రాంతాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి భారీ చెట్టు కూలింది. దీంతో పార్కింగ్‌లో ఉన్న రెండు టెంపో వాహనాలు, ఒక కారు ధ్వంసమయ్యాయి. తమిళనాడుకు చెందిన భక్తులు వరహస్వామి అతిధి గృహంలో గది పొంది పార్కింగ్‌లో వాహనాలు పార్క్ చేశారు. ఈదురు గాలులు, వర్షం తీవ్రతకు చెట్టు వాహనాలపై కూలింది. చెట్టు కూలిన ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో భక్తులు భయబ్రాంతులకు గురయ్యారు. ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

రేపు నగరిలో జాబ్ మేళా

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్ఎఫ్ కంపెనీ సంయుక్తంగా మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 20 నుంచి 26ఏళ్ల లోపు ఉండి 2019 నుంచి 2024లోపు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బయోడేటా, పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు మార్క్ షీట్ జిరాక్సు డిగ్రీ ట్రాన్సుర్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు ఒరిజినల్ ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటో సైజ్ ఫోటోలతో హాజరుకావాలని కోరారు. ఈ ఉద్యోగాలను రాత పరీక్ష ఇంటర్వ్యూ, వైద్యం దృఢత్వం ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ ఉద్యోగాలకు జీతం మొదటి సంవత్సరం రూ.19500, రెండవ ఏడాధి రూ.20,500, మూడవ ఏడాధి రూ.21500, మొదటి సంవత్సరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.10వేలు, రెండవ ఏడాధి రూ.20వేలు, మూడవ సంవత్సరం రూ.30వేలు అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు హెచ్ఆర్ ఎస్ఎస్ కన్నన్ 9952970545 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సూపర్ సిక్స్ అమలు ఏదీ: విజయానందరెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎన్నికల ముందు కుటుంబంలో ఎంతమంది చదువుతున్న విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం పేరుతో అందరికీ ఏడాదికి రూ.15వేలు ఇస్తామని టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలోని తల్లులను మోసం చేసిందని వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంసి విజయానంద రెడ్డి కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక ఉచిత హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను తెలుగుదేశం, బిజెపి, జనసేన ఉమ్మడి కూటమి దగా చేసిందన్నారు. జీవో నెంబర్ 29లో ఓ కుటుంబానికి తల్లికి వందనం రూ.15వేలు ఇస్తామని ప్రకటించడం మోసం



చేయడమే అవుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమైందని ప్రశ్నించారు. ఉచిత ఇసుక పంపిణీ అస్తవ్యస్తంగా ఉందని అలాగే ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు ఎప్పటిలోగా అమలు చేస్తారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నాయకుల పురుషోత్తం రెడ్డి, జ్ఞాన జగదీష్, రామ్ గణేష్, గాయత్రీ దేవి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం కాపాడాలి

- యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ఏపీలో 33వేల పైచిలుకు ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, ఈ ఏడాధి విద్యార్థుల నూతన ప్రవేశాలు చాలా స్వల్పంగా ఉన్నాయని, ఈ పాఠశాలలో రక్షించడం కోసం ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. ఎస్ఆర్ పురంలో యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల వ్యవస్థ బలోపేతం కాకుండా మాధ్యమిక, ఉన్నత పాఠశాల వ్యవస్థ బలోపేతం అయ్యే అవకాశం లేదని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణల వల్ల కొంత నష్టం జరిగితే, కొత్తగా ఏర్పడిన ఈ ప్రభుత్వం ఇంకా విద్యారంగ మీద దృష్టిని సారించకపోవడం వల్ల కూడా ఈ పరిణామాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది పాఠశాలలో ఒక విద్యార్థి మాత్రమే పాఠశాలలో ఉన్నారని, కొన్ని పాఠశాలలో ఒకటవ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా ఈ సంవత్సరం నూతన ఎన్రోల్మెంట్ లేకుండా పోయిందని, చివరికి ఉన్నత పాఠశాలలో సైతం పిల్లలు టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి చేరుతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా తల్లికి వందనం కార్యక్రమాన్ని ఆశగా చూపి పిల్లల్ని ఎన్రోల్మెంట్ చేసుకునే ప్రక్రియను చేపడుతున్నాయన్నారు. ఆ పాఠశాలల మీద ప్రభుత్వ నియంత్రణ లేకుండా పోయిందని విమర్శించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏ సిలబస్ నైతే బోధిస్తున్నారో అదే సిలబస్‌ని ప్రైవేటు పాఠశాలల్లో కూడా బోధించే టట్లుగా చర్యలు తీసుకోకపోవడం కూడా నేడు వ్యవస్థ విచ్చిన్నం అవ్వటానికి కారణంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వం ఒకే మీడియం అని చెప్పి పిల్లలకు ఇంగ్లీషులో నైపుణ్యాన్ని పెంపొందించకుండా, ఇటు మాతృభాష మీద పట్టు లేకుండా చేసి పిల్లలలో నాణ్యత లేని విద్యకు కారకులయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రాథమిక పాఠశాలలో మాతృభాషలో బోధన, ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియాలను ప్రవేశపెట్టడం, విద్యారంగం మీద ప్రత్యేక శ్రద్ధ వహించి కార్యాచరణ తీసుకోకపోతే, భవిష్యత్తులో ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మొత్తం విచ్చిన్నం అవుతుందని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు పూర్తవుతున్న ఇంత వరకు అకాడమిక్ క్యాలెండర్‌ని సైతం ప్రకటించ లేదని, ఎలా పిల్లలకు నాణ్యమైన విద్య వస్తుందో, ప్రభుత్వ పాఠశాలల మీద ఎలా నమ్మకం కలుగుతుందో ప్రభుత్వం చెప్పాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ బడికి పిల్లల్ని ఆకర్షించే పని కూడా చేయాలని యుటిఎఫ్‌గా పిలుపునిచ్చారు. బడి పిల్లలతో నాణ్యమైన విద్య అందించటం, సమాజంతో కలిసి ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయడం తన వృత్తిలో భాగంగా ఉపాధ్యాయులు చేసుకోవాలని కోరారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమే విద్యారంగం మీద దృష్టి సారించాలని, ప్రభుత్వ బడులని ప్రత్యేకించి ప్రాథమిక పాఠశాల వ్యవస్థను రక్షించడానికి పూనుకోవాలని కోరారు. దీనికోసం తక్షణం ఒకటి నుంచి ఐదు వరకు తరగతులన్నీ ప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని, దీనిలో మాతృభాషలోనే విద్య జరపాలని ,ప్రత్యేకించి ఇంగ్లీషు ఉపాధ్యాయుడిని సబ్జెక్టు కోసం నియమించాలని, 6 నుంచి 10 వరకు తరగతుల్లో సమాంతర మీడియాను ప్రవేశపెట్టాలని, జీవో నెంబర్ 117ని తక్షణం రద్దు చేస్తున్నట్లుగా ప్రకటన చేయాలని కోరారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ 504 ప్లస్ టు పాఠశాలలలోని అధ్యాపక పోస్టులన్నింటినీ పర్మినెంట్ చేయాలని, 2003 డిఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, 1998, 2008 ఎంటిఎస్ ఉపాధ్యాయులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.ఎస్.నాయుడు, జివి రమణలు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించడం కోసం చర్యలు తీసుకోవాలని, 12వ పీఆర్‌సీలో ఐఆర్‌ని 30శాతం ప్రకటించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లతో పాటు పిఎఫ్ సౌకర్యాన్ని కలిగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణి గండన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.దీనావతి, టి.రఘుపతి రెడ్డి, నాయకులు, జి.రాధా కృష్ణ, పిఆర్ మునిరత్నం, ఎస్.రెహానా బేగం, సిపి ప్రకాష్, ఎస్‌పి భాషా, కె.రెడ్డెప్ప నాయుడు, డి.ఏకాంబరం, బి.ఈశ్వర మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి హేయం: కేవీపీఎస్

ప్రజాశక్తి-గంగవరం: కడప జిల్లాలో దళితుడిపై అగ్రకులస్తులు సలసల కాగే వంట నూనె పోసి దాడి చేయడం హేయమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం కడప జిల్లాలో జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 77ఏళ్ల స్వాతంత్ర భారతదేశంలో ప్రపంచానికే ఆదర్శమైన రాజ్యాంగం అమలులో ఉన్నప్పటికీ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా దళితుల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఉన్మాదుల్లా దళితులపై దాడికి తెగబడటం దుర్మార్గమన్నారు. సంఘటనపై వెంటనే ప్రభుత్వం స్పందించి దోషులను తీవ్రంగా శిక్షించాలని, బాధితుడు ప్రభాకర్‌కు మెరుగైన వైద్యం అందించాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఈశ్వర్, సుబ్రమణ్యం డిమాండ్ చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో శుభ్రత

- చెత్త, వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి-వికోట: వీకోట పోలీస్ స్టేషన్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను ఆదివారం పోలీసులు పరిశుభ్రం చేశారు. దుమ్ము, ధూళి, పాత వాహనాల వేస్ట్ సామగ్రిని సీఐ లింగప్ప దగ్గరుండి శుభ్రం చేయించారు. ఆవరణంలో కాగితాలు, పాత సామన్లను తొలగించారు. చిత్తూరు ఎస్పి త్వరలో వీకోట స్టేషన్‌ను సందర్శించనున్న నేపథ్యంలో స్టేషన్‌లో పరిశుభ్రతపై చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా ఇప్పటి స్టేషన్‌లో అన్ని రికార్డులు అప్‌డేట్ చేసినట్లు సమాచారం. ఫిర్యాదుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో పరిశుభ్రతపై చర్యలు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులుగా జావీద్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: రాష్ట్ర ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యునిగా కుప్పం పట్టణానికి చెందిన జావిద్‌ను నియమించడం పట్ల కుప్పం ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో కుప్పం ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులు అయిన జావిద్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కుప్పం ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మంజును రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

సర్పంచ్ చొరవ.. తీరిన నీటి సమస్య

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది. ఆ గ్రామంలో 200కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. సరిపడా నీళ్లు రాక సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ బాబు చొరవతో ఆదివారం చెరువులో పంచాయతీ వారు బోరు వేయించారు. దీంతో బోరులో నీళ్లు పడ్డాయి. గ్రామ సమస్య తీరడంతో పలువురు సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు. సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు, మాజీ సర్పంచ్ నియాజ్ అలీ, నీరజాక్షులురెడ్డి, శేఖర్, చిట్టిబాబు, జీవరత్నం తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ ఆసుపత్రి, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న సుమారు 55మంది పరీక్షలు చేయించుకోగా 25మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి శంకర్ నేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి వసతులు, ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూములకు విముక్తి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: శెట్టిపల్లి పంచాయతీకి చెందిన కప్పలనత్తం గ్రామంలో కబ్జాకు గురి అయిన చెరువు భూములకు ఆదివారం విముక్తి కలిగింది. పంచాయతీ పరిధిలో పలు చెరువులు అక్రమ దారుల చెరలో ఉన్నట్టు గ్రామపంచాయతీ సర్పంచ్, టీడీపీ నాయకులు రీటా ఎల్లప్ప గత కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. గత నెలలో విడుదలైన ఎన్నికల ఫలితాల ప్రకారం టీడీపీ రాష్ట్రంలో అధికారం చేపట్టడంతో రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులలో మార్పు వచ్చింది. ఇందులో భాగంగా శెట్టిపల్లి గ్రామ సర్పంచ్ చెరువు ఆక్రమణలను తొలగించే పనులకు కార్యరూపం దాల్చారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామ పరిధిలోని అప్పయ్య చెరువు సర్వే పనులను చేపట్టారు. ఈ సర్వే ద్వారా చెరువు సుమారు రెండు ఎకరాల భూమి దురాక్రమనకు గురైనట్టు అధికారుల వల్ల బహిర్గతమైనట్టు సర్పంచ్ తెలిపారు. సర్వే పనులు ముగిసిన వెంటనే చెరువు చుట్టూ కందకాలు తవ్వి భవిష్యత్తులో ఎవరు దురాక్రమనకు పాల్పడకుండా చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ తెలిపారు.

ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి నిండాలి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి నిండాలి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత అన్నారు. ఆదివారం ఎస్ఆర్ పురం మండలంలో ఉపాధ్యాయుల ఉద్యమ స్ఫూర్తి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్నారని అధికారం చేపట్టేందుకోసం హామీలను తెలిపి అధికారం చేపట్టిన తర్వాత గత ప్రభుత్వం అవలంభించిన విధానాలతో హామీలు నెరవేర్చడంలో విఫలమవుతుందన్నారు. అనంతరం రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, మండల యూటీఎఫ్ అధ్యక్షులు మొగులయ్య, కార్యదర్శి మోహన్ రెడ్డి తదితరులు కలిసి యుటిఎఫ్ అభివృద్ధికి చేపట్టాల్సిన విధివిధానా గురించి చర్చించారు.

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని నెర్నిల్లి గ్రామంలో వెలిసి ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు సీఎం కావడంతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తెచ్చుకున్నారు. ఆలయంలో పంచామృతభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి, దీపారాధన పొంగళ్ళు పెట్టి జంతు బలిదానం చేశారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రెడ్డి, నవీన్, గిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంత మారింది.. సమస్య తీరింది.!

- దీర్ఘకాల సమస్యకు ప్రజాశక్తి వార్తతో పరిష్కారం
- పలువురి అభినందనలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: నాలుగు ప్రధాన నగరాలకు వెళ్లే రహదారులకు కేంద్రం పచ్చికాపల్లం. ప్రతీ అవసరానికి 200గ్రామాలకు చెందిన ప్రజలకు అక్కడి వస్తుంటారు. పచ్చికాపల్లంలో ప్రతి ఆదివారం వారపు సంత జరుగుతుంది. సంత స్థలంలో కాకుండా అక్కడి వ్యాపారస్తులు, రైతులు రోడ్డుపై విక్రయాలు జరుపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం అధిక సంఖ్యలో అక్కడికి వచ్చే ప్రజలు, భారీ వాహనాలు, బైక్‌లు, కార్లు ఇబ్బంది పడుతుంటారు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపోయి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగేది. స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ విషయంగా గత మంగళవారం ప్రజాశక్తిలో 'సమస్యల సంత.. పట్టించుకోండి కొంత' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈవోపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి, పోలీసులు సమన్వయంతో సంత సొంత స్థలాన్ని శుక్రవారం శుభ్రం చేయించారు. ఆదివారం ఉదయం నుంచి అక్కడి వచ్చే వ్యాపారస్తులు, రైతులను నేరుగా సంత స్థలంలో నిర్వహణ చేపట్టాలని సూచించారు. రైతులు విశాలమైన సంత స్థలంలో వ్యాపారాలు సాగించారు. ఇన్నాళ్లూ ఆదివారమైతే ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడ్డ ప్రజలకు ఉపశమనం లభించింది. సమస్యను గుర్తించి వార్త ప్రచురించి అధికారుల్లో చలనం తీసుకొచ్చిన ప్రజాశక్తికి పలువురు అభినందనలు తెలిపారు. అధికారుల చర్యల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సౌకర్యాలు కల్పించాలని..

ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సంత స్థలంలో అనేక మంది ప్రజలు వస్తుంటారు. అక్కడ శాశ్వత షెడ్లు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి సౌకర్యం కల్పించేలా పాలకులు చొరవ చూపాలని పలువురు కోరారు. ప్రజలకు సౌకర్యవంతంగా సంత నిర్వహించుకొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చాలా మంచి పని..

ఏళ్ల తరబడి సమస్యకు ఒక్క వార్తతో పరిష్కారం దొరికింది. సంతను సొంత స్థలంలోకి తరలించడం చాలా మంచి పని. ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం, వాహన ప్రమాదాలు లేకుండా పొయింది. ప్రజాశక్తికి అభినందనలు.

- రవి, దుకాణదారులు, పచ్చికాపల్లం

పకడ్బందీగా వారపు సంతను నిర్వహిస్తాం..

పచ్చికాపల్లంలో జరిగే వారపు సంతను పకడ్బందీగా నిర్వహిస్తాం. రోడ్డుపై వ్యాపారస్తులు, రైతులు కుప్పలు పెట్టకుండా చూస్తాం. ఈవోపీఆర్డితో కలిసి స్థానిక పోలీసులకు చెప్పాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. దండోరా వేయిస్తాం.

- మోహన్, పంచాయతి కార్యదర్శి, పచ్చికాపల్లం

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండలం గుడ్లనాయనపల్లి పంచాయతీలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నమెంటులో గెలుపొందిన క్రీడాకారులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం, విస్తారన విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో ఎన్ఆర్‌సి టీమ్ విజయాన్ని సాధించగా వారికి యాభై వేలు నగదు బహుమానంతో పాటు ట్రోఫి అందజేశారు. కెప్టెన్ అజిత్ టీం వారికి రెండవ బహుమానం కింద ముప్పై వేలు నగదు బహుమానాన్ని, జెఎస్ఆర్ టీం మూడవ స్థానం సాధించడంతో వారికి రూ.20వేల నగదు బహుమానాన్ని, రజనీ టీం నాలుగవ స్థానంలో నిలవగా వారికి రూ.పది వేలు నగదు బహుమానాన్ని ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో గోపినాథ్, సత్యేంద్రశేఖర్, మణి, మురళి, మహేంద్ర, వాసు, టోర్నమెంట్ నిర్వాహకులు, రాహుల్ చంద్, కమల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు మండలంలో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మండలంలోని చిన్నబండపల్లె గ్రామంలో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన శుద్ధి నీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వావిల్ తోట క్రాస్ నుంచి చిన్నబండపల్లె గ్రామం వరకూ ద్విచక్ర వాహనాలు, కారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు మంగళహారతులు అందించగా, భారీగా బాణాసంచలు పేల్చి గజమాలతో సత్కరించి ఆహ్వానం పలికారు. అనంతరం నీటి శుద్ధి కేంద్రంను చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సి.ఆర్.రాజన్‌తో కలిసి ప్రారంభించారు. తన సొంత నిధులతో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందించిన లక్ష్యంతో టిడిపి నాయకులు గంగారపు గోపిని ఆయన అభినందించారు.

గ్రామ ఐక్యత కోరి వలస

ప్రజాశక్తి-కుప్పం టౌన్: గ్రామ ప్రజల క్షేమం కోరి, వారి మధ్య ఐక్యత లోపించినప్పుడు గ్రామం నుంచి వలస వెళ్లడం జరుగుతుందని గుడిపల్లి మండలం గుడికొత్తూరు గ్రామ ప్రజలు తెలిపారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి గ్రామ ప్రజలు వలస వెళ్లడం వారి పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం సూర్యోదయానికి ముందు గ్రామ ప్రజలతో పాటు వారి పెంపుడు జంతువులను, పశువులను వెంటపెట్టుకుని, గ్రామ దేవత విగ్రహాలతో సహా గ్రామాన్ని విడి వలస వెళ్లారు. అనంతరం గ్రామ సమీపంలోని గంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సూర్యాస్తమయం తరువాత ముందుగా గ్రామంలోనికి పశువులు ప్రవేశిస్తుందని, అనంతరం గ్రామదేవత విగ్రహాలు వారి వెనుక ప్రజలు గ్రామంలోనికి ప్రవేశించడం ఆచారంగా వస్తుందని వారు తెలిపారు.

బోరు వైర్లు చోరీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని ఎం.కొత్తూరు పంచాయతీలోని రామసముద్రంలో బోరు వైర్లు చోరీకి గురైయ్యాయి. గుర్తు తెలియని దుండగులు శనివారం రాత్రి బోరు మోటారు కేబుల్‌లను అపహరించారు. ఆదివారం ఉదయం గ్రామంలో నీటి కొరత రావడంతో అక్కడికి వెళ్లి మెటారును పరిశీలించి గ్రామస్తులు వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించి అధికారులు, సర్పంచ్‌కు సమాచారమిచ్చారు. అక్కడికి చెరుకున్న సర్పంచ్ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ గౌడ్, సిచివాలయ సిబ్బంది 95మీటర్ల వైరు కట్ చేసినట్లు గుర్తించారు.

'కార్పెంటర్‌ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి'

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కార్పెంటర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రంగబాబు అన్నారు. ఆదివారం స్థానిక షాదీ మహల్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో సమస్యలన్నీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. వృత్తిరిత్యా చేతులకు దెబ్బలు తగిలితే వాటికి ఆరోగ్యశ్రీ వైద్యం వర్తింపజేసేలా కోరుతామన్నారు. అదేవిధంగా బైరెడ్డిపల్లిలో అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. కార్యక్రమంలో గౌస్ పీర్, ముని వెంకటప్ప, వీర బ్రహ్మాచారి, సుబ్రహ్మణ్యం ఆచారి, నరసింహమూర్తి, షంషీర్ బేగ్, సుబ్రహ్మణ్యం శెట్టి, రాజేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోవా.. పాలకా

తప్పదా ఈ రోడ్డుపై వెళ్లక

ప్రజాశక్తి-విజయపురం: మండల కేంద్రమైన విజయపురం మండలం పరిశ్రమల గ్రామాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పైగా కురిసిన వర్షంతో రోడ్డుపై గుంతల మయంగా ఉండడంతో వర్షపు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. మండలంలోని మంగళం-గాండ్ల కండ్రిగ రోడ్డుపై ఉన్న భారీ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రెండు గంటల పాటు కురిసిన వర్షం విత్తనాలను వెదజల్లిన చేలకు ఉపయోగకరమని రైతులు వర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే రైతులు నేరుగా విత్తనాలను వెదజల్లారు వరుడు రాక కోసం ఎదురు

చూస్తున్న ఈ తరుణంలో మండలంలో వర్షం కొనడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో ఖరీఫ్ సాగు పనులు మరింత ముమ్మరంగా సాగనున్నాయి. నగిరి నుంచి విజయపురం మండలానికి రావలసిన అధికారులు ఆ రోడ్డుమీద గాని వస్తూపోతూ ఉంటారు అయినప్పటికీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతల మయంగా ఉన్నత రోడ్డును బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టిడిపి నేత కుమారుడిపై దాడి

- కేసు నమోదు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ ననియాల గ్రామానికి చెందిన టిడిపి నేత మనోహర్ కుమారుడు చరణ్ సాయిపై శనివారం రాత్రి వైసిపి నేతలు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 89 పెద్దూరు సర్పంచ్ భర్త గోవిందప్ప, అతని అనుచరులు సతీష్, మురుగేష్‌లు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. చరణ్ సాయి తలకు తీవ్రమైన గాయాలు కావడంతో కుప్పం ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వైసిపి నేతల దాడిలో గాయపడ్డ చరణ్ సాయి

జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని 89 పెద్దురు పంచాయతీలో జసేనన పార్టీ జెండాను కూటమి నేతలు ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షుడు హరీష్, టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించినందుకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి లేక ప్రజా కక్ష పాలన సాగింది అన్నారు. రానున్న ఐదేళ్లలో ప్రజాపాలనతో సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్కరికి చేరుతుందన్నారు. రోడ్లు, భవనాలు, విధి దీపాలు, డ్రైనేజీలు, తాగునీరు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నరేష్, రామ్మూర్తి, నరసింహులు, చిన్నికృష్ణ, విశ్వనాధ్, సుబ్రీ, బాలరాజు, వెంకటరమణ, అవినాష్, సురేష్ పాల్గొన్నారు.

ఘన సన్మానం

ప్రజాశక్తి-పలమనేరు: పెద్దపంజాణి మండలం రాయలపేట ఎంపీపీ పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తూ జయరామప్ప మే నెలలో ఉద్యోగ విరమణ పొందారు. ఈయన ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్‌గా పనిచేశారు. కాగా ఆదివారం పలమనేరులోని ఏవీసీ కన్వెన్షన్ హాల్‌లో పలువురు ఎంఈవోలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మోహన్, ప్రహ్లద, చంద్ర, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మంచాన పడ్డ ఊరు..

- ఆకుల కొత్తూరులో ప్రబలుతున్న విష జ్వరాలు

జ్వరంతో బాధపడుతున్న మహిళ

ప్రజాశక్తి-బైండ్లపల్లి: చిన్నపిల్లలు, మహిళలకు విష జ్వరాలు ప్రబలి ఆ పల్లె మంచాన పడ్డది. వివరాల్లోకెళితే.. మండలంలోని బేలపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న ఆకుల కొత్తూరు గ్రామంలో కొద్ది రోజులుగా తాగునీటి సమస్య వల్ల గ్రామంలో ప్రజలు వివిధ రకాల జ్వరాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తాగునీటి విషయంలో ఇబ్బందులున్నాయని అక్కడి ప్రజలంటున్నారు. ఈ విషయంగా పంచాయతీ కార్యదర్శి బాలాజీని వివరణ కోరగా తాను పది రోజులుగా సెలవులో ఉన్నట్లు తెలిపారు. వైద్యాధికారి వివరణ కోరగా గ్రామంలో సోమవారం క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బడి పిల్లల చింత తీరేనా..

- బయటకు రావాలంటేనే భయం
- ప్రమాదకరంగా గోతులు
- ఇనుప ఫిల్లర్లతో ఇబ్బందులు

సత్యవేడు మండలం చెరివి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గత రెండేళ్లుగా అనేక సమస్యలతో అల్లాడుతున్నారు. కనీసం పాఠశాల ముందు భాగంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో సాయంత్రం వేళల్లో ఆడుకోవాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. అక్కడ నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులు మండల శాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక వర్షాకాలంలో ఇక్కడ విద్యార్థులు తరగతిగదులకే పరిమితం కావలసిన దయనీయ పరిస్థితి ఏర్పడింది.

ప్రజాశక్తి- సత్యవేడు

చెరివి ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 60మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విశాలమైన ఆట స్థలాలు అందుబాటులో ఉన్న వీరు సాయంత్రం వేళల్లో ఆట్లాడుకోవడం ప్రమాదకరంగా మారింది. పాఠశాల ఆవరణంలోనే గ్రామస్తులు, తల్లిదండ్రులు వద్దని నెత్తినోరు మొత్తుకున్నా.. సచివాలయ నిర్మాణానికి కొందరు పూనుకున్నారు. పాఠశాల ఆవరణలోనే ఈ భవనాలు ఏర్పాటు చేస్తే సమస్యలు వస్తాయని విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. పునాదులు తీసి కాంక్రీట్ పిల్లర్లు వేశారు. ఇంతలోనే హైకోర్టు ప్రజల పక్షాన ఓ మంచి తీర్పును ఇచ్చింది. పాఠశాల ఆవరణలో ప్రభుత్వ భవనాలు ఏవీ నిర్మించకూడదని తీర్పు ఇవ్వడం జరిగింది, దాంతో భవన నిర్మాణాలు ఆగిపోయింది. అయితే ఆ పిల్లర్ల చుట్టూ ఎక్కడపడితే అక్కడ ఇనుప కమ్మీలను అలాగే వదిలేశారు. దాంతో పిల్లలు అక్కడికి వెళ్లకుండా చూడటం ఉపాధ్యాయులకు భారంగా మారిపోయింది.

గోతులు, ఇనుప కమ్ములతో భయం భయం

అక్కడి పాఠశాల పరిసరాలు అధ్వానంగా ఉంది. ముఖ్యంగా ప్రహరీ లేకపోవడం వల్ల ఇబ్బందులతోపాటు ఓ పక్క సిమెంట్ పిల్లర్లు, వాటి చుట్టూ ఎక్కడబడితే అక్కడ ఇనుప కమ్మీలు దీనికి తోడు పక్కనే రైతు భరోసా భవన నిర్మాణానికి తీసిన పెద్దపెద్ద గోతులు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. గంటసేపు వర్షం కురిసినా ఆ గోతుల్లో వర్షపు నీరు నిలబడిపోతుంది. కొందరు ముందు బాబులు అక్కడక్కడ మద్యం తాగి బాటిళ్లు ఇక్కడే పగలగొట్టి వెళ్లిపోతున్నారు. ప్రహరీ నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నా కొందరు వ్యక్తిగత స్వార్థంతో సమస్యలు సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఏ బుక్కుల్లో నమోదు కానీ పనులకు బిల్లులు అడుగుతుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు వీటిపై దృష్టిపెట్టాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి..

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే యుద్ధ ప్రాతిపదికన తమ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రమాదకర సమస్యలను తొలగించాలని, సచివాలయ నిర్మాణం కొరకు ఏర్పాటుచేసిన సిమెంట్ పిల్లర్లను తొలగించి, సమీపంలో ఉన్న పెద్దపెద్ద గోతులను పూడ్చివేయడానికి ఆదేశాలు ఇవ్వడంతో పాటు పాఠశాల చుట్టూ ప్రహరి నిర్మాణానికి చొరవ తీసుకోవాలని పాఠశాలలో చదువుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.